సాక్షి నంద్యాల

శుక్రవారం । 6 । జనవరి । 2023



దత్తాత్రేయుడికి విశేషపూజలు
శ్రీశైలంటెంపుల్: ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి దేవస్థానం ఈఓ లవన్న, అర్చకులు విశేషపూజలు నిర్వహించారు.



భవిష్యత్తుకు 'నవోదయ'ం
బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్నారు. 6వ తరగతిలో 80 సీట్ల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,623.66
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:72.201
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,749

న్యూస్‌రీల్

మార్చి నెలాఖరు వరకు కేసీకి సాగునీరు!



కేసీ కాల్వలో పారుతున్న సాగునీరు

జూపాడుబంగ్లా: కర్నూలు–కడప కాల్వకు మార్చి వరకు సాగు నీరు సరఫరా చేసే అవకాశాలున్నాయని ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సుంకేసుల డ్యాంలో 1.2 టీఎంసీల నీటి మట్టం ఉండగా డ్యాం నుంచి కేసీ కాల్వకు 710 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతల పథకం రెండు మోటార్ల ద్వారా 680 క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు 650 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వ ఆయకట్టుకు 30 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉచితంగా వైకుంఠ దివ్యదర్శనం



దివ్యదర్శనానికి బయలుదేరుతున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామానికి చెందిన భక్తులకు పట్టణానికి చెందిన సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వైకుంఠ దివ్యదర్శనం నిమిత్తం తిరుపతికి బస్సులో బయలుదేరారు. స్థానిక పాండురంగ స్వామి ఆలయం వద్ద బస్సును కోవెలకుంట్ల ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, ఏజీపీ తిరుపతయ్య, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం, న్యాయవాది విష్ణుమనోహర్‌రెడ్డి, దేవదాయశాఖ జిల్లా ఇన్‌చార్జ్ రవిశంకర్‌నాయుడు, సేవా సంస్థ జిల్లా ధర్మ ప్రచారకుడు శ్రీనివాసులు, మండల కన్వీనర్ రవీంద్రనాథరెడ్డి, సహ కన్వీనర్ రాఘవాచారి, విద్యాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అపరాధ రుసుంతో 'ఓపెన్' ప్రవేశాలు

నంద్యాల(సిటీ): అపరాధ రుసుం చెల్లించి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పీఠం(ఓపెన్ స్కూల్)లో 2023–24 విద్యా సంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం పొందవచ్చని డీఈఓ అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాల్ పథకం కింద అపరాధ రుసుం 10వ తరగతికి రూ.400, ఇంటర్మీడియెట్‌కు రూ.500 చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఏపీ ఆన్‌లైన్ ద్వారా అపరాధ రుసుం చెల్లించి ప్రవేశాలు పొందవచ్చని సూచించారు.

టిడ్కో గృహాల పరిశీలన



గృహాలను పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల(సిటీ): పట్టణ శివారులోని నందమూరి నగర్, అయ్యలూరు మెట్ట వద్ద ఏర్పాటు చేసిన టిడ్కో గృహాలను టిడ్కో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్(ఎస్ఈ) రాజశేఖర్, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ గోపాలకృష్ణారెడ్డి, ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిలు గురువారం పరిశీలించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(అర్బన్) జగనన్న నగర్ ఏపీ టిడ్కో నంద్యాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7న టిడ్కో గృహ సముదాయాల ప్రారంభోత్సవాలను పురస్కరించుకుని అధికారులు గృహాలను పరిశీలించారు.

శ్రీశైలంలో 90 టీఎంసీల నీటి నిల్వలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో గురువారం మధ్యాహ్నం సమయానికి 90 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. జలాశయానికి వరద ప్రవాహం లేనప్పటికీ దిగువ ప్రాంతాలకు నీరు విడుదలవుతుండటంతో నీటి మట్టం క్రమేపీ తగ్గుతోంది. బుధవారం నుంచి గురువారం వరకు కుడిగట్టు కేంద్రంలో 3.280 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 0.262 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 7,559 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 2,328 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 855.70 అడుగులకు చేరుకుంది.

నంద్యాల జిల్లా ఓటర్లు 13,53,923

- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం
- ఎస్ఎస్ఆర్–2023 తుది జాబితా విడుదల

కర్నూలు(సెంట్రల్): ఓటరు తుది జాబితాను గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. నంద్యాల జిల్లాలో మొత్తం ఓటర్లు 13,53,926 మంది కాగా పురుషులు 6,69,877 మంది, మహిళా ఓటర్లు 6,83,762 మంది ఉన్నారు. ఇతరులు 284 మంది ఉన్నారు. తుది జాబితా ప్రకారం పురుషుల కంటే 13,885 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా చూసినా మహిళా ఓటర్లే అధికం. నంద్యాల నియోజకవర్గంలో 5,748 మంది, బనగానపల్లె 1,702, ఆళ్లగడ్డ 1,466, శ్రీశైలం 2,085, నందికొట్కూరు 2,008, డోన్ 876 మంది చొప్పున ఎక్కువగా ఉన్నారు.

వచ్చే ఏడాది నుంచి రెండుసార్లు ఓటర్ల జాబితా విడుదల

ఏటా అక్టోబర్ నుంచి జనవరి వరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2023 పేరుతో ఓటర్ల జాబితాలో సవరణలు చేపట్టేవారు. ఇందులో పేర్లు, చిరునామాలు, నియోజకవర్గాల మార్పు, చనిపోయిన వారి, డూప్లికేట్ ఓటర్లను తొలగించడం తదితర కార్యక్రమాలను ఎన్నికల సంఘం చేపట్టేది. అందులో భాగంగానే ఈ యేడాది అక్టోబర్ నుంచి జనవరి 5వ తేదీల మధ్య జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని చుట్టి వస్తారు. కొత్తగా ఓటర్ల నమోదు, డూప్లికేట్ ఓటర్లపై విచారణ చేపడతారు. కాగా వచ్చే యేడాది నుంచి సంవత్సరానికి రెండుసార్లు సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది.

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
ఆళ్లగడ్డ	1,12,590	1,14,056	17	2,26,663
శ్రీశైలం	95,776	97,861	45	1,93,682
నందికొట్కూరు	1,04,478	1,06,486	12	2,10,976
నంద్యాల	1,27,176	1,32,924	95	2,60,195
బనగానపల్లె	1,18,924	1,20,626	34	2,39,584
డోన్	1,10,933	1,11,809	81	2,22,823
మొత్తం	6,69,877	6,83,762	284	13,53,923

రాయలసీమ పశ్చిమ నియోజకవర్గానికి జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఘట్టంలో తొలి అంకం ముగిసింది. గత నెల 30న తుది ఓటరు జాబితా ఖరారైంది. ఈ నెలాఖరులో నోటిఫికేషన్ వెలువడనుంది. మార్చిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేసింది. దీంతో ప్రధాన పార్టీలైన వైఎస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ ప్రకటించిన అభ్యర్థులతో పాటు ఆశావహులు ప్రచారపర్వంపై దృష్టి సారించారు. ఆరు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి ఓటర్లతో సమావేశమవుతున్నారు. దీంతో ఉమ్మడి కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. – సాక్షి ప్రతినిధి కర్నూలు





పట్టం కట్టేదెవరికి.. పోరం కలిసొచ్చేదెవరికి!



పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు

- ఈ నెలాఖరులో నోటిఫికేషన్.. మార్చిలో ఎన్నికలు
- పట్టభద్రుల ఓట్లు 3,28,807.. ఉపాధ్యాయుల ఓట్లు 27,716
- గత ఎన్నికల్లో పట్టభద్రుల కోటా ఓట్లు 2.52లక్షలు
- పెరిగిన ఓట్లతో వైఎస్సార్‌సీపీకే ప్రయోజనమనే చర్చ
- ప్రచార పర్వాన్ని హోరెత్తిస్తున్న ఆశావహులు



వెన్నపూస రవీంద్రారెడ్డి

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు వెన్నపూస గోపాల్‌రెడ్డి, కత్తి నరసింహారెడ్డిల పదవీకాలం మార్చితో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ వీటి భర్తీకి ఉపక్రమించింది. ఇప్పటికే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలు నిర్వహించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డితో పాటు స్వతంత్ర అభ్యర్థులు విస్తృత ప్రచారంలో తలమునకలవుతున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులతో.. యూనియన్ల వారీగా, శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి మద్దతు కోరుతున్నారు. పట్టభద్రుల కోటాలో 3,28,807 ఓట్లు నమోదయ్యాయి. గత ఎన్నికల్లో 2.52లక్షలు మాత్రమే ఉన్నాయి. అంటే గతంతో పోలిస్తే 76వేల ఓట్లు అధికం. పెరిగిన ఓట్లు ప్రభుత్వ పనితీరును, గ్రాడ్యుయేట్లు, ఉద్యోగులపై ప్రభుత్వ చిత్తశుద్ధిని స్పష్టం చేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ భావిస్తోంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ

వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులతో పాటు 'అనంత' నుంచి పోటీ చేస్తోన్న బీసీ నాగరాజు మధ్య ప్రధాన పోటీ ఉండే అకాశం ఉంది. వీరితో పాటు బోరంపల్లి ఆంజనేయులు, గైబున్నీసా, బోయ నాగరాజు, పట్టుపోగుల పవన్ కుమార్‌తో పాటు పలువురు పోటీలో ఉన్నా, పోటీ మాత్రం ఆ ముగ్గురి మధ్యనే ఉన్నట్లు తెలుస్తోంది. వెన్నపూస రవీంద్రారెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్సీ, ఎన్జీవో సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు తనయుడు కావడం సానుకూలాంశం. రాంగోపాల్‌రెడ్డి పులివెందుల నియోజవకర్గ వాసి. ఎవ్వరికీ తెలియని వ్యక్తి! రవీంద్రారెడ్డి అభ్యర్థిత్వాన్ని ఆరు జిల్లాలలోని 26మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఇన్‌చార్జీలు ఏకగ్రీవంగా సమర్థించారు. బాధ్యత తీసుకుని గెలుపునకు కృషి చేస్తున్నారు. రాయలసీమలోని 52 అసెంబ్లీ స్థానాల్లో 49 చోట్ల ఓడిపోయామని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఘోర పరాభావం తప్పదని, పోటీ వద్దని టీడీపీ ఇన్‌చార్జీలు భావించారు. గత ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీగా వైఎస్సార్‌సీపీ ఉండి ఎమ్మెల్సీ గెలిచిందని, ఇప్పుడు టీడీపీ ప్రతిపక్షంలో ఉండి కనీసం పోటీ చేయకుంటే ఆ ప్రభావం కేడర్‌పై బలంగా పడుతుందని నామ మాత్రపు పోటీకి సిద్ధమైంది. పోటీకి అభ్యర్థులు ముందుకు రాకపోవడంతో రాంగోపాల్‌రెడ్డిని తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ నాయకత్వం ఎంత బలహీనంగా ఉందో తెలిసిందే. అక్కడ టీడీపీకి ఎలాంటి విజయాలు లేవు. అలాంటి నియోజకవర్గం నుంచి అభ్యర్థిని నిలపడం చూస్తే ఈ ఎన్నికలను టీడీపీ ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థమవుతోంది. రవీంద్రారెడ్డి 28 నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి తరచూ సమావేశాలు నిర్వహించి ఓటర్లను కలుస్తున్నారు. రాంగోపాల్‌రెడ్డి చంద్రబాబు పర్యటనలో మినహా ఎక్కడా కనిపించని పరిస్థితి.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి అనుకూల అంశాలు

- సచివాలయాల ఏర్పాటుతో వేలాది నిరుద్యోగులకు సర్కారు కొలువులు.
- ఇచ్చిన మాటకు కట్టుబడి ఉద్యోగులకు వేతనాలు పెంచడంతో పాటు పర్మనెంట్ చేయడం.
- పోలీస్‌రిక్రూట్‌మెంట్ ద్వారా 6,900 పైగా ఉద్యోగాల భర్తీకి చర్యలు.
- అభ్యర్థుల వినతి మేరకు వయస్సు సడలింపు నిర్ణయం.
- న్యాయశాఖ పరిధిలో 3వేలకుపైగా ఉద్యోగాల భర్తీ
- గ్రూప్–1 నోటిఫికేషన్‌కు చర్యలు.
- వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీలన్నీ భర్తీకి నిర్ణయం.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీలోనూ త్రిముఖ పోరే..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో 27,716 ఓట్లు నమోదయ్యాయి. గతంతో పోలిస్తే ఈ ఓట్లు కూడా పెరిగాయి. ఈ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డితో పాటు బీజేపీ నేత ఒంటేరు శ్రీనివాసరెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు పోటీ చేస్తున్నారు. కత్తి, ఒంటేరు, రామచంద్రారెడ్డి మధ్య త్రిముఖ పోరు ఉండే అవకాశం ఉంది. కత్తి ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘానికి చెందిన వ్యక్తి. ఉపాధ్యాయ ఎన్నికల్లో యూనియన్లు ప్రధానపాత్ర పోషించే అవకాశం ఉంది. ఇక్కడ అభ్యర్థి గెలుపోటములను యూనియన్లే ప్రభావితం చేయనున్నాయి. దీంతో అభ్యర్థులంతా యూనియన్ల నేతలు, సభ్యులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

- చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఆదేశించారు. వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉగాది నాటికి రాష్ట్రంలో ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. రబీ సీజన్ ఈ క్రాప్ బుకింగ్ గడువులోగా వంద శాతం పూర్తి చేయాలన్నారు. అర్హత ఉన్న రైతులందరికీ పీఎం కిసాన్ పథకం వర్తించేందుకు రైతుల నుంచి ఈ–కేవైసీ వేయించాలన్నారు. ఆక్వా హబ్‌ల ఏర్పాటు ఏర్పాటు చేయాలని, స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇప్పించాలని, జాతీయ రహదారులకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరైన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల్లో మెరుగైన పనితీరు, సమగ్ర పర్యవేక్షణ ఉండాలన్నారు. సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనలో సచివాలయాల ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జేసీ నిశాంతి, జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా సెలవులు పెట్టొద్దు

ఇష్టానుసారంగా సెలవులు పెట్టొద్దని సచివాలయ ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సూచించారు. వీడియోకాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి సంబంధిత శాఖల ఉన్నతాధికారులే సెలవులు మంజూరు చేయాలి తప్ప ఎంపీడీఓలు కాదన్నారు. అనుమతి లేకుండా సెలవుల్లో వెళ్లిన సిబ్బందికి నోటీసులు జారీ చేసి వెంటనే విధుల్లో చేరేలా చూడాలన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

గోస్పాడు: ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్ది పేదలకు కార్పొరేట్ వైద్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని యాళ్లూరు ఆరోగ్య కేంద్రంలో గురువారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాళ్లూరు గ్రామంలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 2023 డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బొక్కెం రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ల బాధ్యతల స్వీకరణ



ఆర్.వెంకట్రామిరెడ్డి, ఎస్.రత్నం, డి.మద్దులేటి స్వామి

కర్నూలు(లీగల్): సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్లు గురువారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు అర్బన్ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా ఆర్.వెంకట్రామిరెడ్డి, కర్నూలు రూరల్ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా ఎస్.రత్నం బాధ్యతలు స్వీకరించారు. అలాగే నంద్యాల రైల్వే కోర్టు జడ్జిగా మద్దులేటి స్వామి బాధ్యతలు చేపట్టారు. వీరికి పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

సీబీఎస్ఈతో విద్యాప్రమాణాలు మెరుగు

నంద్యాల(సిటీ): సీబీఎస్ఈ సిలబస్‌తో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగు పడతాయని డీఈఓ అనురాధ తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్‌కు ఎంపికైన 69 పాఠశాలల హెచ్ఎంలు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎంలకు స్థానిక గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడారు. అంతకుముందు సీబీఎస్ఈ అఫిలియేషన్, పరీక్షా విధానం, శిక్షణా కార్యక్రమాలు, అధికారుల బాధ్యతలు, సిలబస్‌పై రాష్ట్ర రీసోర్స్ పర్సన్స్ సుధారాణి, అపర్ణ అవగాహన కల్పించారు. సీబీఎస్ఈ అమలులో ఉన్న సందేహాలను జిల్లా రీసోర్స్ పర్సన్స్ దినేష్, లక్ష్మణరావు నివృత్తి చేశారు. సమావేశంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారిణి లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్‌ల కో–ఆర్డినేటర్‌గా చల్లా మధుసూదన్‌రెడ్డి



కర్నూలు(రాజ్‌విహార్): జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథి(జేసీఎస్)ల కర్నూలు, నంద్యాల జిల్లాల కోఆర్డినేటర్(సమన్వయకర్త)గా చల్లా మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టత, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలు, విమర్శలను తిప్పికొట్టేందుకు ఇటీవల జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను నియమించడం తెలిసిందే. వీరిని సమన్వయపరిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా కో–ఆర్డినేటర్లను నియమించారు. అందులో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన చల్లా మధుసూదన్‌రెడ్డికి కర్నూలు, నంద్యాలతో పాటు వైఎస్సార్ కడప, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల బాధ్యతలు అప్పగించారు.

అన్నప్రసాద తయారీలో నాణ్యత పాటించాలి

- శ్రీశైలదేవస్థానం ఈఓ ఎస్ లవన్న



అన్నప్రసాదాన్ని పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని అన్నప్రసాద తయారీలో నాణ్యత పాటించాలని ఆలయ ఈఓ ఎస్ లవన్న అధికారులను ఆదేశించారు. అన్నదాన ప్రసాద వితరణ భవనంలోని వంటశాల, కూరగాయల నిల్వ గది, సరుకుల వివరాలు, అన్నప్రసాద వితరణ గదిని గురువారం ఈఓ పరిశీలించారు. తాజా కూరగాయాలు ఉపయోగించాలని, వంటలన్నీ నాణ్యతతో రుచికరంగా వండించాలని అన్నదాన పర్యవేక్షకురాలు దేవికను ఆదేశించారు. సాయంత్రం అల్పాహారంలో ఇడ్లీ, చపాతీలను అందజేయాలన్నారు. వంట తయారీ యంత్రాలకు అవసరమైన మరమ్మతులు ఎప్పటికప్పుడే చేయించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. అన్నప్రసాదం వడ్డించే సిబ్బంది డ్రస్ కోడ్ పాటించాలని, భక్తులతో మర్యాదగా మెలగాలని సూచించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహారెడ్డి, అన్నదాన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భవన్ కుమార్ ఉన్నారు.

పాఠశాలల తనిఖీ



అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న సామేల్

బనగానపల్లె రూరల్: ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం శ్రీయోజన) పథకానికి ఎంపికైనా మండలంలోని పాతపాడు ఎంపీపీ, ఇల్లూరుకొత్తపేట జెడ్పీ పాఠశాలలను పీఎం శ్రీయోజన రాష్ట్ర పర్యవేక్షణాధికారి సామేల్ గురువారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులపై ఆరా తీశారు. గదులు, బల్లలు, మరుగుదొడ్ల శుభ్రత, డైనింగ్‌హాల్, తాగు నీరు, విద్యుత్ తదితర సౌకర్యంతో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎంలు ఉన్నారు.

భవిష్యత్తుకు 'నవోదయ'ం

- 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెలాఖరు వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష



బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం

ఎమ్మిగనూరు: ఉత్తమ విద్యా బోధన..విలువలతో కూడిన నడవడిక.. విద్యా ప్రమాణాల పెంపు.. క్రీడానైపుణ్యాలను వెలికితీయడం.. సమైక్యతాభావం పెంపొందించే ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసినదే జవహర్ నవోదయ విద్యాలయం. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు ఎమ్మిగనూరు మండలం బనవాసి వద్ద 1986–1987లో జవహర్ నవోదయ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. ప్రతిఏటా 6, 9 తరగతుల్లో ప్రవేశాల కోసం పరీక్షలు నిర్వహిస్తారు. 2023–24 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతిలో 80 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు.

అర్హతలు ఇవే..

కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అన్ని మండలాల్లో 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. 2011 మే 1వ తేదీ నుంచి 2013 ఏప్రిల్ 30 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4 తరగతులు పూర్తి చేసి ప్రస్తుతం 5వ తరగతి చదువుతూ ఉండాలి. గతంలో ప్రవేశపరీక్షకు హాజరైన వారు అనర్హులు.

రిజర్వేషన్లు ఇలా..

బనవాసి జవహర్ నవోదయలో 80 సీట్లకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. అందులో 75 శాతం గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం పట్టణాల్లోని పాఠశాలల్లో విద్యనభ్యసించే బాలబాలికలకు కేటాయిస్తారు. బాలికలకు 33 శాతం కోటా అమలులో ఉంటుంది . షెడ్యూల్డ్ కులాలకు 15 శాతం, షెడ్యూల్డ్ తరగతులకు 7శాతం, దివ్యాంగులకు 3శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్ష కోసం కోచింగ్ సెంటర్లలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటారు. కష్టపడి చదివిన వారికి తప్పక సీట్లు వస్తాయి.

ఎంఈఓ కార్యాలయాల్లో దరఖాస్తులు

నవోదయ దరఖాస్తులను ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ కార్యాలయాలు, జిల్లా విద్యాశాఖాధికారుల కార్యాలయాలు, ఏపీ సమగ్ర శిక్షణ కార్యాలయల్లో పొందవచ్చు. జవహర్ నవోదయ వెబ్‌సైట్‌నుంచి కూడా దరఖాస్తు పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 31లోగా ఎంఈఓ కార్యాలయాల్లోగాని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకుగాని అందజేయాలి.

ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష

నిర్దేశించిన పరీక్షా కేంద్రాల్లో ఏప్రిల్ 29న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఒకదాన్ని విద్యార్థులు ఎంపిక చేసుకోవాలి. ప్రవేశ పరీక్షలో 100 మార్కులు ఉంటాయి. ఆబ్జెక్టివ్ చాయిస్ ద్వారా నిర్వహించే పరీక్షలో మూడు విభాగాల కింద ప్రశ్నలు ఉంటాయి. మేధాశక్తిపై 50, తెలుగు, గణితం విభాగాల్లో ఒక్కోదానికి 25 చొప్పున 50 ప్రశ్నలు ఉంటాయి. పారదర్శకంగా ఎంపిక విధానం ఉంటుంది. పరీక్ష పత్రాల రూపకల్పన, విద్యార్థుల ఎంపిక మొత్తం సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్వహిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు 6,7 తరగతులను తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకూ సీబీఎస్ఈ పద్ధతిలో ఇంగ్లిష్‌లో మాత్రమే బోధన చేపడుతారు.

విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం



జవహర్ నవోదయ విద్యాలయంలో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా బోధన ఉంటుంది. బాలబాలికలకు వేర్వేరుగా ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తున్నాం. విద్యార్థుల్లో సమైక్యతా భావం పెంపొందించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నాం. జేఈఈ, నీట్ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ ఉంటుంది. – సాగరిక, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ (బనవాసి)

క్లుప్తంగా

'నూతన' శుభాకాంక్షలు



లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి. లక్ష్మణ్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

కర్నూలు(లీగల్): లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి. లక్ష్మణ్ రెడ్డిని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు కె. కిషోర్ కుమార్, సభ్యులు నారాయణరెడ్డి, నసీమ కౌసర్‌లు గురువారం మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ మఠంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి



శ్రీమఠంలో ప్రదక్షిణ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ప్రద్యుమ్న

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ప్రద్యుమ్న గురువారం మంత్రాలయం వచ్చారు. ఈయనకు సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య బొకే అందజేసి స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను, అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని దర్శించుకున్నారు. ఈయనకు పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, స్వామివారి మెమొంటో, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు. మంత్రాలయానికి బైపాస్ రోడ్డు మంజూరు చేయాలని ప్రద్యుమ్నను పీఠాధిపతి కోరారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఆత్మకూరు రూరల్: వైఎస్ఆర్ స్మృతివనంలో సరదాగా ఊయల ఊగుతూ కింద పడి తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పాములపాడు మండలం వేంపెంట గ్రామానికి చెందిన నెత్తికొప్పుల రాజమ్మ, యేసేపు దంపతుల కుమారుడు నవీన్(20) ఈనెల 2న కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మకూరు మండలం నల్లకాలువ గ్రామ శివారులో ఉన్న వైఎస్ఆర్ స్మృతివనానికి వెళ్లారు. నవీన్ పార్కులోని ఊయల ఎక్కి సరదాగా ఊగుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో కుటుంబ సభ్యులు నంద్యాలలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్తమ షార్ట్ ఫిల్మ్‌గా ఆనందో బ్రహ్మ



పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణ చైతన్య

కర్నూలు కల్చరల్: విశాఖ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 'ఆనందో బ్రహ్మ' షార్ట్ ఫిల్మ్ ఉత్తమ పురస్కారాన్ని గెలుచుకుంది. ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ సహకారంతో గురువారం విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్నూలుకు చెందిన రచయిత, దర్శకుడు కృష్ణ చైతన్య నిర్వాహకుల నుంచి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ చిత్రంలో బైటింటి మీనాక్షిరెడ్డి, సాయికుమార్ ముఖ్య పాత్రల్లో నటించారు. వీరితో పాటు షాషావలి, భాగ్యలక్ష్మి, శివప్రకాష్, భరత్, గురుదేవ్, వేణుగోపాల్‌లు పలు పాత్రలు పోషించారు.ఈ చిత్రాన్ని సుధాశర్మ, బైటింటి మీనాక్షిరెడ్డి నిర్మించారు. అశ్వత్ కుమార్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకులు కృష్ణ చైతన్య మాట్లాడుతూ చదువు గొప్పతనం చెబుతూ, నేటితరం మరచి పోతున్న విలువలను గుర్తు చేస్తూ ఈ షార్ట్ ఫిల్మ్ తీసినట్లు చెప్పారు.



ఆలూరులో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

వేడుకలా కొత్త పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు వేడుకలా జరుగుతున్నాయి. గురువారం ఆలూరులో కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ కొత్తవారికి పింఛన్లు పంపిణీ చేశారు. కల్లూరు శరీన్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య పాల్గొన్నారు. ఎమ్మిగనూరు, గోనెగండ్లలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సి.బెళగల్‌లో కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ నూతన పింఛన్లను పంపిణీ చేయడంతో పాటు లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్, పాసుపుస్తకం, ముఖ్యమంత్రి లేఖ అందజేశారు. జిల్లాలో కొత్తగా 8,446 మందికి పింఛన్లు మంజూరైన విషయం తెలిసిందే.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి ఆర్జేడీ నిర్మలాకుమార్ ప్రియ

- తిరుపతి ఆర్జేడీ నిర్మలా కుమార్ ప్రియ

నంద్యాల(సిటీ): చవుదుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తిరుపతి ఆర్జేడీ నిర్మలా కుమార్ ప్రియ అన్నారు. స్థానిక ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాపోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి ఆర్జేడీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని 11 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల చిన్నారిని అమ్మకానికి పెట్టిన తండ్రి



పోలీసుల అదుపులో చిన్నారి, తండ్రి రాముడు

డోన్ రూరల్: ఆడపిల్ల అని వదిలించుకోవాలని అనుకున్నాడో, ఆర్థిక సమస్యలను నుంచి గట్టెక్కాలని ఆలోచించాడో.. ఓ తండ్రి తన రెండేళ్ల చిన్నారిని అమ్మకానికి పెట్టాడు. ఈ విషయం తెలిసి పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. డోన్ రైల్వే స్టేషన్ సమీపంలోని అమ్మ హోటల్ వద్ద ఓ వ్యక్తి రెండు సంవత్సరాల బాలికను ఎత్తుకొని, డబ్బులు ఇస్తే తన కూతురును ఇచ్చేస్తానని అక్కడ ఉన్న స్థానికులకు చెప్పాడు. దీంతో వారు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడి చేరుకొని చిన్నారిని, తండ్రిని అదుపులోకి తీసుకొని విచారించారు. చిన్నారి తండ్రి పేరు రాముడని, తెలంగాణ రాష్ట్రం అలంపూర్ మండలం పచ్చర్ల గ్రామమని తేలింది. బిడ్డను ఎందుకు అమ్మకానికి పెట్టాలనుకున్నాడో రాముడు చెప్పలేదని పోలీసులు తెలిపారు. చిన్నారిని ఐసీడీఎస్ అధికారులకు అప్పజెప్పారు.

నేటి నుంచి నీలకంఠేశ్వరుని ఉత్సవాలు



విద్యుత్ దీపాలంకరణలో నీలకంఠేశ్వరస్వామి దేవాలయం

ఎమ్మిగనూరు: నీలకంఠేశ్వరస్వామి ఉత్సవాలకు ఎమ్మిగనూరు ముస్తాబైంది. శుక్రవారం నుంచి స్వామివారి వేడుకలు మొదలు కానున్నాయి. ఈ సందర్భంగా గురువారం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ప్రధాన రహదారులు, కూడళ్లను అలంకరించారు. ఆలయాలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు మొదలవుతాయని ప్రధాన అర్చకులు సత్యనారాయణ స్వామి తెలిపారు. రాత్రి 11.45 గంటలకు ఆది దంపతులైన పార్వతి పరమేశ్వరుల కళ్యాణం జరిపిస్తారు. 7వ తేదీ శనివారం రాత్రి ప్రభావళి మహోత్సవం నిర్వహిస్తారు. 8వ తేదీ ఆదివారం సాయంత్రం మహారథోత్సవం, 9వతేదీ సోమవారం రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు వ్యాహావళి మహోత్సవం ఉంటుంది. 10వ తేదీ మంగళవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 9గంటల వరకు వసంతోత్సవం నిర్వహిస్తారు.

నూనెను మళ్లీ కాస్తే 'టీపీసీ' పట్టేస్తుంది!

- ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు సరికొత్త పరికరం
- ఆరోగ్యశాఖ అధికారులకు అందించిన రాష్ట్ర ప్రభుత్వం



వంటనూనెలో టీపీసీ పరికరాన్ని ఉంచి పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఓవీ రాముడు



టీపీసీ పరికరంలో చూపుతున్న రీడింగ్

కర్నూలు(హాస్పిటల్): బయట వేడి వేడి బజ్జీలు తినాలని కోరిక ఉందా? అయితే మళ్లీ మళ్లీ వేయించిన నూనెనే వాడుతున్నారని భయంగా ఉందా? ఇకపై ఆ చింత వద్దు. ఎందుకంటే ఇలాంటి వ్యాపారుల ఆటకట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త పరికరాన్ని తీసుకొచ్చింది. దీనిని వేడి నూనెలో పెడితే చాలు ఎన్నిసార్లు వాడిందో, దాని నాణ్యత ఏమిటో ఇట్టే తెలిసిపోతుంది. టోటల్ పోలార్ కాంపోనెంట్(టీపీసీ) పరికరాలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లకు ఒక్కొక్కరికి ఒక్కోటి అందజేశారు. ఇటీవల వచ్చిన వీటిని తీసుకుని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు క్షేత్రస్థాయికి బయలుదేరారు. ఇప్పటికే ఎమ్మిగనూరులో రెండు స్వీట్స్‌షాప్‌లు, మూడు హోటళ్లలో, బనగానపల్లెలో రెండు చోట్ల తనిఖీలు చేశారు. సాధారణంగా హోటళ్లు, బజ్జీ సెంటర్లలో కాచిన వంటనూనెను మళ్లీ మళ్లీ వాడుతుంటారు. నిబంధనల ప్రకారం రెండు సార్ల కంటే ఎక్కువగా వంటనూనెను వేడి చేసి వాడకూడదు. ఇలా వాడితే గ్యాస్ట్రబుల్, అల్సర్‌తో పాటు ప్రమాదకరమైన క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. ఈ సమస్యను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం టీపీసీ పరికరాలను అధికారులకు అందజేసింది. వీటితో వేడి నూనెలో అధికారులు తనిఖీ చేస్తారు. రెండుసార్లకు లోపు కాచిన నూనెలో 25 టీపీసీ రీడింగ్ ఉంటుంది. అంతకు మించి రీడింగ్ ఉంటే దానిని ఎక్కువసార్లు వేడిచేసినట్లు నిర్ధారిస్తారు. ఈ మేరకు సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసి అవసరమైతే ప్రజారోగ్య చట్టం కింద రిమాండ్‌కు తరలిస్తారు.

త్వరలో బయోడీజిల్‌గా...

రెండుసార్లు వాడినా ఇంకా వంటనూనె మిగిలితే దానిని బయోడీజిల్‌గా వాడుకునేందుకు ఓ ఏజెన్సీ ముందుకు వచ్చింది. ఇప్పటికే గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో ఇలాంటి నూనెను ఆ ఏజెన్సీ కొనుగోలు చేస్తోంది. త్వరలో కర్నూలు జిల్లాలోనూ కొనుగోలు చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఓవీ రాముడు తెలిపారు. వ్యాపారులు రెండుసార్లు మించి వేడి చేసిన వంట నూనెను ప్రత్యేకంగా ఒక డబ్బాలో తీసి ఉంచితే సదరు ఏజెన్సీ వారు వచ్చి లీటర్ రూ.30 చొప్పున కొనుగోలు చేస్తారని ఆయన వివరించారు. త్వరలో జిల్లాలో ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3332	8109
పొద్దుతిరుగుడు	4598	6069
ఆముదం	5039	6419
మొక్కజొన్న	1769	2169
ఉల్లి	937	1622
ఎండు మిర్చి	5000	27205
కందులు	2000	7119

కర్నూలు మార్కెట్ యార్డు ఫోన్ నంబర్లు 08518–257204, 257661

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం



శివసింహారెడ్డి(ఫైల్)

కొలిమిగుండ్ల: చెన్నైలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కనకాద్రిపల్లెకు చెందిన బీటెక్ విద్యార్థి గురువారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన పుచ్చ చంద్రశేఖర్‌రెడ్డి, హైమావతి దంపతుల కుమారుడు శివసింహారెడ్డి(20) చెన్నైలోని బెంగళూరు హైవేలో ఉన్న సవిత ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ సెకండియర్(సీఎస్ఈ)చదువుతున్నాడు. మధ్యాహ్నం కాలేజీ నుంచి రూమ్‌కు బైక్‌లో వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో లారీ శివసింహారెడ్డిపై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు చెన్నైకు బయలుదేరారు.

గుండెపోటుతో ఆరోగ్య కార్యకర్త మృతి



అక్కమ్మ (ఫైల్)

వెల్దుర్తి: గుండెపోటుతో ఆరోగ్య కార్యకర్త వి.అక్కమ్మ (49) గురువారం ఉదయం మృతి చెందారు. వెల్దుర్తి ఆరోగ్య కేంద్రం–2లో పనిచేస్తున్న ఈమె ను గత నెల 30న కోసిగికి బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు తీసుకుని ఆమె అదే రోజు తన సోదరి నివాసం ఉంటున్న గుత్తి పట్టణానికి వెళ్లారు. కోసిగిలో బాధ్యతలు స్వీకరించేందుకు ఈనెల 2వ తేదీన బయలు దేరుతుండగా గుండెపోటుకు గురయ్యారు. అనంతపురం ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక ఆమె గురువారం మృతి చెందారు మృతదేహాన్ని స్వగ్రామం వెల్దుర్తికి తీసుకురాగా పలువురు నివాళులర్పించారు. ఉలిందకొండ పీహెచ్‌సీ, వెల్దుర్తి సీహెచ్‌సీ, సచివాలయ ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, దళిత సంఘాల నాయకులు అందరూ కలిసి మృతురాలి కుటుంబీకులకు రూ.25వేలు తక్షణ సాయం అందించారు. అక్కమ్మకు 8వ తరగతి చదువుతున్న కుమార్తె ఉంది.

యువకుడి ఆత్మహత్య



లక్ష్మీనారాయణ (ఫైల్)

పాణ్యం: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ జలీల్ తెలిపిన వివరాలు.. రైల్వే ట్రాక్‌పై మృతదేహం పడి ఉందనే సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామానికి చెందిన రామకృష్ణ, నాగలక్ష్మి దంపతుల కుమారుడు లక్ష్మీనారాయణ(30)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ట్రాక్‌పై పడుకొని ఉండగా మెడపై రైలు వెళ్లడంతో మొండెం, తల వేర్వైందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య స్నేహలత గ్రామ వలంటీర్‌గా పనిచేస్తోంది. కుమారుడు, కూతురు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విజిలెన్స్ అధికారుల సోదాలు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గురువారం విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యాలయాల్లో పలు అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. గతంలో ఏసీబీ దాడుల్లో రెండు కార్యాలయాల్లో మధ్యవర్తుల నుంచి భారీ మొత్తంలో డబ్బు స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ అరుణ్‌కుమార్‌ను విధుల నుంచి తప్పించారు. ప్రస్తుతం కూడా రెండు కార్యాలయాల్లో డబ్బు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.